ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 1 జూన్ 2024



పిడుగురాళ్లలో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ మాలికా గార్గ్, పోలీసు అధికారులు

పోలీసు శాఖ.. కొరడా

- పోలింగ్ హింసపై ప్రత్యేక దృష్టి
- బైండోవర్ ఉల్లంఘించిన వారిపై చర్యలు
- అల్లర్లకు పాల్పడిన 382 మందిపై రౌడీషీట్లు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు జిల్లా బహిష్కరణ

నరసరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు, ఆ తర్వాత పల్నాడులో చోటు చేసుకున్న హింసాకాండపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. హింసకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కొరఢా ఝుళిపిస్తోంది. ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు జిల్లాలో పది వేల మందికిపైగా బైండోవర్ చేశారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు ఎన్నికల సందర్భగా జరిగిన పలు హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న 382 మందిపై రౌడీషీట్లు తెరిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని జిల్లా బహిష్కరణకు పోలీసుశాఖ సమాయత్తమవుతోంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి నేరాలకు పాల్పడమని, నేరాలకు పాల్పడితే తమపై చర్యలు తీసుకోవచ్చని బైండోవర్ సందర్భంగా ఒప్పంద పత్రాలను రెవెన్యూ శాఖ ద్వారా పోలీసు శాఖ స్వీకరించింది. తాము నేరాలకు పాల్పడితే నగదు కూడా చెల్లిస్తామని కూడా అంగీకరించారు. అయితే జిల్లాలో 13, 14 తేదీల్లో జరిగిన హింసాకాండ ఘటనల్లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా బైండోవర్‌లోని వ్యక్తులు నేరాల్లో పాల్గొన్నరా అన్న అంశంపై పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. బైండోవర్‌లో ఉన్న దాదాపు 250 మంది పోలింగ్ హింస సఘటనల్లో ఉన్నట్టుగా నిర్ధారించి పోలీసులు నోటీసులు చేశారు. బైండోవర్‌ను ఉల్లంఘించిన వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బైండోవర్ సందర్భంగా తీసుకున్న బాండ్ మేరకు వారి వద్ద సదరు మొత్తం వసూలు చేయనున్నారు. ఒక్క గురజాల పోలీసు డివిజన్‌లోనే 147 మంది బైండోవర్ ఉల్లంఘించి నట్లు పోలీసుశాఖ తెలియజేసింది. నరసరావుపేట, సత్తెనపల్లి పోలీసు డివిజన్ల పరిధిలో దాదాపు 103 మందిని గుర్తించారు. బైండోవర్ సందర్భంగా గతంలో వారు చేసిన నేరాలను, సదరు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు నుంచి రూ.2 లక్షల వరకు బాండ్లు స్వీకరించారు. బాండ్ లో నమోదు చేసిన మేరకు డబ్బు చెల్లించాలని సదరు వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేశారు. ఒక వేళ బాండ్‌లో పేర్కొన్న విధంగా డబ్బు చెల్లించలేకపోతే వారి ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఒకవేళ ఆస్తులు లేకుంటే వారెంట్ తీసు కుని జైలుకు పంపే అంశాన్ని పోలీసు శాఖ పరి శీలిస్తోంది.

161 కేసులు 1320 అరెస్టు

పల్నాడు జిల్లాలో పోలింగ్ హింసాత్మక సంఘటనల నేపథ్యంలో పోలీసులు 161 కేసులు నమోదు చేశారు. ఆయా కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 1320 మందిని అరెస్టు చేశారు. కేసుల్లో ఉన్న వ్యక్తులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఎస్పీ మాలికా గార్గ్ నియమించారు. కొత్తగా మరో 1196 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మాచర్ల నియోజకవర్గంలో 7 ఈవీఎంలను ధ్వంసం చేసిన కేసుల్లో 59 మందిని అరెస్టు చేశారు. పోలింగ్‌కు ముందు రోజు జరిగిన సంఘటనలకు సంబంధించి 33 కేసుల్లో 143 మందిని అరెస్టు చేశారు, పోలింగ్ రోజున 106 కేసుల్లో 883 మందిని, పోలింగ్ తర్వాత రోజు జరిగిన ఘటనల్లో నమోదైన 24 కేసుల్లో 203 మందిని అరెస్టు చేశారు.

నేరస్తులకు హెచ్చరికలు..

నేర చరిత్ర ఉన్న ఏ వ్యక్తి అయినా అదుపుతప్పి ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి అవసరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రౌడీషీటర్ ఓ రాజకీయ పార్టీ ఆఫీసు వాచ్‌మన్‌పై దాడి చేసి అతడ్ని కొట్టి ఆఫీసును తగల పెడతానని బెదిరించగా ఆ వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు పంపించారు.



సత్తెనపల్లిలో పర్యటిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నేటి సాయంత్రం నుంచి దుకాణాల బంద్

- హనుమాన్ జయంతి వేడుకల ర్యాలీలు నిషేధం
- పిడుగురాళ్లలో పోలీసు కవాతులో ఎస్పీ మాలికాగార్గ్

ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తోన్న తరుణంలో శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేక చర్యలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంది. అయితే చిరువ్యాపారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చారు. కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో శనివారం సాయంత్రం నుంచి నిబంధనలను కఠినతరం చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి లేదని, ప్రజలు గుడిలో మాత్రమే స్వామి వారికి పూజలు నిర్వహించుకోవాలని ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు. ప్రజలు ఎక్కడా గుమికూడరాదని ఏదైనా అత్యవసరమైతేనే బయటికి రావాలని సూచించారు. ప్రజలు ఎన్నికల ఫలితాల అనంతరం సంయమనం పాటించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

ఎంతటివారినైనా ఉపేక్షించం

పిడుగురాళ్ల: ఎన్నికల ఫలితాల రోజున, తర్వాత గొడవలకు దిగినా, ప్రోత్సహించినా వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని పల్నాడు జిల్లా ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్లలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు, మిలటరీ, సాధారణ పోలీసులతో కవాతు నిర్వహించారు. అనంతరం ఐలాండ్ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఒకప్పుడు బాగా ఉన్న నక్సలిజం ప్రస్తుతం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఇటీవల ఎన్నికల పుణ్యమా అని జాతీయ స్థాయిలో పల్నాడుకు ఓ గుర్తింపు వచ్చిందన్నారు. గతంలో ఎప్పుడూ ఎన్నికల సమయంలో ఇంతటి గొడవలు జరగలేదని, ఇప్పుడే ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించాలన్నారు. నేతలకు ఏమీ కాదని, సాధారణ వ్యక్తులు ఎందుకు గొడవలకు దిగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల గొడవల్లో కేసు నమోదైతే జీవితాంతం వెంటాడుతుందన్న విషయం తెలుసుకోవాలన్నారు. జూన్ 1వ తేదీ సాయం త్రం నుంచి 5వ తేదీ వరకు దుకాణాలన్నీ మూసివేయా లన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రాజు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ రబ్బానిఖాన్ తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లిలో అనుమతులు లేని విత్తనాలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు (పాత చిత్రం)

అమ్మకాలు.. తనిఖీలు

- విత్తనాలపై వ్యవసాయశాఖ హడావుడి
- రైతుల చేతికి అందాక రంగంలోకి అధికారులు
- వేటికి అనుమతులున్నాయో లేవో తెలియక రైతులకు నష్టం
- ఏటా ఆలస్యంగా మేల్కొంటున్న యంత్రాంగం.. వ్యాపారులకు వరం

పిడుగురాళ్ల, మే 31: వరుణుడు కరుణిస్తున్నాడు. సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వివిధ రకాల విత్తనాలను వ్యాపారులు ఎప్పటి నుంచే అమ్మకాలు చేస్తున్నారు. ధరలు పెరుగుదల, కొరత తదితరాల నేపథ్యంలో రైతులు ముందుగానే విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చిపెట్టుకున్నారు. అయితే ఇప్పుడిప్పుడే వ్యవసాయశాఖ మేల్కొంటోంది. నకిలీ విత్తనాలను తేల్చేందుకు అధికారులు రంగంలోకి దుకాణాల్లో తనిఖీలు మొదలుపెట్టారు. చాలావరకు విత్తనాలు రైతుల వద్దకు చేరిపోయాక ఇప్పుడు తనిఖీల వల్ల లాభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏవి అసలు.. ఏవి నకిలీ.. వేటి వల్ల లాభం.. అనే విషయాలపై రైతుల్లో గందరగోళం ఉంది. విత్తనాల గురించి రైతులకు చెప్పే వారే లేకుండా పోయారు. వ్యాపారులు చెప్పినట్లు చాలాదగ్గర్ల రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. తీరా ఆరుగాలం కష్టపడి చివర్లో దిగుబడి రాక లబోదిబోమంటూ రైతులు రోడ్డెక్కడం ప్రతీ ఏటా పరిపాటిగా మారుతోంది. అయినా వ్యవసాయశాఖ విత్తనాల విషయంలో రైతులకు మేలు చేసే ఆలోచనే చేయడం లేదు. వ్యాపారులకు, విత్తనాల ఉత్పత్తిదారులకు మేలు చేసేలా అధికారుల చర్యలు ఉంటున్నాయన్న విమర్శలు, ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వంలో కనీస స్పందన ఉండటంలేదు. కొందరు వ్యాపారులు దిగుబడుల ఆశచూపి రైతులకు విత్తనాలను అంటగడుతున్నారు. తమకు ఎక్కువ కమీషన్ ఇచ్చే కంపెనీల విత్తనాల విక్రయాలపైనే వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే కొందరు వ్యాపారులు విత్తనాల అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. ధరలు పెరుగుతాయని, స్టాక్ అయిపోతుందన్న భ్రమచూపి కొందరు వ్యాపారులు సిండికేట్‌గా తయారై రైతులకు విత్తనాలను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులతో సంబంధం లేకుండానే వ్యాపారులు యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. అయినా వ్యవసాయశాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది గురజాల మండలం పల్లెగుంతలో కొందరు రైతులు ఓ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలను సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేసి ఆందోళన చేశాక కంపెనీ యాజమాన్యం పరిహారం చెల్లించింది. ఇదేదో సీజన్‌కు ముందే అధికారులు తనిఖీలు చేపట్టి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తే మేలు చేసినట్లు. కానీ ఆ దిశగా అటు అధికారులు ఇటు ప్రభుత్వం చర్యలు ఉండటంలేదు.

అధికారుల తీరు ప్రశ్నార్థకం

సీజన్ ప్రారంభ దశలో విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సిన వ్యవసాయశాఖ మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. ఏఏ విత్తనాల కంపెనీల విత్తనాలకు అనుమతులు ఉన్నాయి.. వాటి గడువు తదితర వివరాల బహిరంగ పర్చకుండానే వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమ్మకాలకు అనుమతి లేని పత్తి, మిరప విత్తనాలను కూడా గత ఏడాది పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయించారు. అంతా అయిపోయిన తర్వాత విజిలెన్స్ అధికారులు వరుసదాడులకు దిగడంతో పల్నాడులో వివిధ ప్రాంతాల్లో అనుమతులు లేని విత్తనాలను రైతులకు అమ్మేసిన విషయాన్ని గుర్తించింది. అయితే అప్పటికే ఆ విత్తనాలతో రైతులు సాగు చేపట్టారు. ఈ ఏడాది కూడా ఇదే పునరావృతమైంది. అనుమతులు లేకుండా అమ్ముతున్న విత్తనాలను దాచేపల్లిలో రెండు రోజుల క్రితం విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు వచ్చి పల్నాడులో అనుమతులులేని విత్తనాలను గుర్తిస్తుంటే స్థానికంగా ఉండే వ్యవసాయశాఖ అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారింది. కొందరు వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లకుండానే పుస్తకాలను కార్యాలయానికి తెప్పించుకుని తనిఖీలు పూర్తయినట్లుగా ముద్ర వేస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ఏదో మొక్కుబడిగా ముందే సమాచారం ఇచ్చి ఎంపిక చేసుకున్న దుకాణాల్లో తనిఖీలతో మమ అనిపించి చేతులు దులుపుకుంటున్న అధికారులు కూడా ఉన్నారు. తనిఖీల పేరిట మామూళ్లను సీజన్‌కు ముందే వసూలు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు ఉన్నారు.



పిడుగురాళ్ల వ్యవసాయశాఖ విత్తన పరీక్షా కేంద్రం

నిబంధనలు పాటించని వ్యాపారులు

విత్తన దుకాణాల ముందు అనుమతులు పొందిన కంపెనీ వివరాలు, నిల్వలు, ధరల పట్టికను బోర్డుపై రాసి బహిరంగంగా ఉంచాలి. ఈ నిబంధనలను కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలా దుకాణాల వద్ద వివరాలు తెలిపే పట్టిక బోర్డును ప్రదర్శిస్తున్న దాఖలాలు లేవు. అనుమతులు లేని విత్తనాలను అంటగడుతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవడంలో వ్యవసాయశాఖ మీనమేషాలు లెక్కిస్తుంది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న విత్తనాలకు అనుమతులు ఉండటంలేదు. ఆయా విత్తనాల కొనుగోలు తరువాత రశీదులు కూడా ఇవ్వకపోవడంతో దిగుబడి, పంట నష్టం జరిగిన సమయంలో తగిన పరిహారం పొందేందుకు రైతులు తంటాలు పడాల్సి వస్తుంది.

86 పీహెచ్‌సీలు 8 కాన్పులు..

- ఉద్యోగులపై వైద్య ఆరోగ్య శాఖ కొరఢా
- విధుల నుంచి ముగ్గురు స్టాఫ్‌నర్సుల ఉద్వాసన
- ఆస్పత్రి ప్రసవాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి
- అధికారుల చర్యలతో హడలిపోతున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- రాష్ట్ర స్థాయి ఆరోగ్య సూచీల్లో వెనకబడిన ఉమ్మడి గుంటూరు జిల్లా

గుంటూరు సిటీ, మే 31: ఉమ్మడి గుంటూరు జిల్లా 86 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 8 ప్రసవాలే జరిగాయి. ఆపరేషన్లు వద్దు- ప్రసవాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే ఆస్పత్రి ప్రసవాలపై క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని.. అందువల్లే ప్రసవాలు జరగడంలేదని అధికారులు భావించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్తలూరు, ఈపూరు, పొన్నూరు పీహెచ్‌సీల్లో ఒక్కోటి, ఈమనిలో రెండు, వెల్లటూరులో మూడు చొప్పున ఆస్పత్రి ప్రసవాలు జరిగాయి. ఇవి మినహా మిగిలిన కేంద్రాల్లో కాన్పుల జాడే లేదు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత ఆరు నెలల కాలంలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఆస్పత్రి ప్రసవం జరగలేదు. దీంతో ఉన్నతాధికారులకు చర్యలకు సిద్ధమయ్యారు. ఆస్పత్రి ప్రసవాలు చేయడంలో వెనుకబడిన ముగ్గురు స్టాఫ్ నర్సులను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. గడచిన నెలలో ఆస్పత్రి ప్రసవం ఒక్కటి కూడా చేయనందుకు బాపట్ల జిల్లా పెరవలికి చెందిన సీహెచ్ మాణిక్యం, బీ సువర్చల, ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు చెందిన జీ మేరీమమతను ఉద్యోగం నుంచి తొలగిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ముగ్గురు కూడా సీనియర్ స్టాఫ్ నర్సులు కావడం గమనార్హం. ఆస్పత్రి ప్రసవాలపై మే 25న నిర్వహించిన సమీక్షలోనే సదరు స్టాఫ్ నర్సులను విధుల నుంచి తొలగించాలని అధికారులను కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశించారు. ఆస్పత్రి ప్రసవాల విషయంలో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉండటంతో క్షేత్ర స్థాయి సిబ్బంది హడలిపోతున్నారు. దీంతో వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులకు డెలి'వర్రీ' ఫీవర్ పట్టుకుంది.

అసలు బోణి కొట్టని ఆస్పత్రులెన్నో..

రాష్ట్ర స్థాయి ఆరోగ్య సూచీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాగా వెనకబడింది. ఆస్పత్రి ప్రసవాల్లో అట్టడుగు స్థాయికి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 50 పీహెచ్‌సీలు 24 గంటలు తెరిచే ఉంటున్నాయి. ఆయా కేంద్రాల్లో అనుభవం కలిగిన వైద్యులతో పాటు కాన్పులకు అన్ని రకాల వసతులు కూడా ఉన్నాయి. నియోనేటల్ కేర్ యూనిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయినా ఆస్పత్రి ప్రసవాలు జరగకపోవడం గమనార్హం. ఒకటి అర ప్రసవాలకు ఆస్పత్రికి వచ్చినా వైద్యులు తగిన రీతిగా స్పందించక పోవడంతో వచ్చిన కేసులు కూడా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. డాక్టర్లు లేకుండా కాన్పు చేస్తే ఆ తర్వాత సమస్యలు వస్తాయన్న భయంతో స్టాఫ్ నర్సులు సాహసం చేయడం లేదని సమాచారం.

ప్రైవేటుకు వెళ్తే కోతే కోత

గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అన్ని విధాలా నష్ట పోతున్నారు. అక్కడ చాలా సందర్భాల్లో సహజ ప్రసవం జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తున్నారు. ఈ ఆపరేషన్ కోసం రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదే కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగితే ప్రభుత్వమే తల్లికి రూ.5 వేల వరకు చెల్లిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్ నర్సులు చాలా వరకు సాధారణ ప్రసవం కొరకు ప్రయత్నం చేస్తారు. ఈ విషయం తెలిసి చాలామంది ప్రభుత్వ ఆస్పత్రికి మొగ్గు చూపుతున్నా వైద్యుల నిర్లక్ష్యం వల్ల కేసు లు వెనక్కి పోతున్నాయి.

కేంద్రాలకు దూరంగా నివాసం

ఆస్పత్రిలో ప్రసవాలు జరగకపోవడానికి ప్రధాన కారణం వైద్యులు అందుబాటులో లేకపోవడమే. చాలా మంది వైద్యులు ఉద్యోగం చేసే ప్రాంతానికి చాలా దూరంలో నివాసం ఉంటున్నారు. గుంటూరు నుంచి జిల్లాలోని నలుమూలలకు వెళ్లి వస్తున్నారు. డాక్టర్ దగ్గరలో లేరన్న సమాధానం ఎక్కువగా వినపడుతుండటంతో ఎక్కువ మంది పీహెచ్‌సీల్లో కాన్పులకు రావడానికి భయపడుతున్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరగాలంటే అందరి పాత్ర ఉండాలని స్టాఫ్ నర్సులు అంటున్నారు. కేసు ఆస్పత్రికి వస్తే కదా తాము కాన్పులు చేసేదని వారు పేర్కొంటున్నారు. డాక్టర్లు అందుబాటులో లేకుండా మొత్తం బాధ్యత తమకు అప్పగిస్తే కాన్పు సమయంలో తలెత్తే సమస్యలను తాము ఏ రీతిగా కట్టడి చేయగలమని ప్రశ్నిస్తున్నారు. అందరినీ వదిలి పెట్టి తమపై చర్యలు సహేతుకం కాదని వారంటున్నారు.



అభ్యర్థుల్లో.. ఉత్కంఠ

- జిల్లా వ్యాప్తంగా గెటుపు ఓటములపై జోరుగా చర్చ
- అభ్యర్థుల గెలుపుపై ఎవరి అంచనాలు వారివే
- పోలింగ్ సరళి ఆధారంగా లెక్కలు కడుతున్నారు
- జూన్ నాలుగు పైనే అందరి దృష్టి

నరసరావుపేట, మే 31(ఆంధ్రజ్యోతి): హోరాహోరీగా ఎన్నికల పోరు ముగిసినప్పటికీ అభ్యర్థుల్లో ఉత్కంఠ మాత్రం వీడలేదు. ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందోనన్న ఆందోళన కనిపిస్తోం ది. అనుచరుల ద్వారా నియోజకవర్గంలో నమో దైన పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు. పోలింగ్ రోజు ఓటర్ల నాడి పూర్తిగా మారిపోవడంతో గెలుపోటముల అంచనాలు తలకిందులవుతున్నాయి. అనూహ్యంగా మారిపోయిన జిల్లా రాజకీయ పరిస్థితులపై రాజకీయ వర్గాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. అభ్యర్థుల గెలుపు ఓటములపై జిల్లాలో రసవత్తర చర్చలు సాగుతున్నాయి.

పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల ఆధారంగా అభ్యర్థులు అంచనాకు వస్తున్నారు. ఏఏ కేంద్రంలో తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయో లెక్కలు వేస్తున్నారు. గెలుపు ఓట ములపై ముఖ్య అనుచరులతో చర్చిస్తూ ఒక అంచనాకు వస్తున్నారు. నమోదైన పోలింగ్ ఆధారంగా జిల్లా ప్రజలు కూడా ఎవరికి వారే అంచనా వేస్తూ ఫలితాలపై జోరుగా చర్చించుకుంటున్నారు. ఫలితాలపై బెట్టిం గ్‌లు కట్టడంతో పాటు ఏపార్టీ అభ్యర్థి గెలుస్తారో అంచనాకు వస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా నాలుగు రోజులే ఉండటంతో పోటీ చేసిన అభ్యర్థు ల్లో మాత్రం గెలుపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొం ది. 4న ఓటర్ల తీర్పు వెలువడనుంది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. నరసరావుపేట లోక్‌సభ స్థానంలో భారీగా పోలింగ్ నమోదైంది. ఓటు వేసేందుకు ఓటర్లు పోటెత్తారు. 14,86,594 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 85.69గా నమోదైంది. కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు(టీడీపీ), అనిల్ కుమార్ యాదవ్(వైసీపీ) ఎవరికి వారే గెలుపు లెక్కల్లో మునిగితేలు తున్నారు. శాసనసభ నియోజకవర్గాల వారీగా అనుకూల, ప్రతికూల పరిస్థితులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి లావుకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయనేది చర్చల సారంశం.

నరసరావుపేట లోక్‌సభ స్థానంలో విజయంపై తెలుగుదేశం పార్టీ కూటమి ధీమాతో ఉంది. భారీ ఆధిక్యం లభిస్తుందని అంచనా. అత్యధికంగా ఓటర్లు టీడీపీ కూటమి వైపే మొగ్గుచూపారన్న అభిప్రాయాన్ని నేతలు వ్యక్తపరుస్తున్నారు. ఏడు శాసనసభ నియోజక వర్గాల్లోనూ స్పష్టమైన ఆధిక్యం వస్తుందని అం చనా వేశారు. సామాజిక వర్గాల వారీగా ఎక్కువ మంది ఓటర్లు టీడీపీకి అండగా నిలిచారని భావిస్తున్నారు. చిలకలూరిపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. మరో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా మంచి మెజార్టీని కైవసం చేసుకుంటామని లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఓట్లు పోలయ్యాయన్న లెక్కలు కడుతున్నారు. లోక్‌సభ స్థానంలో టీడీపీ సత్తా చాటుతుందని ఆ పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు.

ఓట్ల లెక్కింపు ఇలా..

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి రౌండ్లుగా విభజించారు. ప్రతి రౌండ్లో 14 పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలైన ఓట్లను.. లెక్కిస్తారు. అసెంబ్లీ, పార్లమెంటరీ పరిధిలోని ఓట్లను ఒకేసారి సమాంతరంగా లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌లు, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ఒకేసారి ప్రారంభం అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బాలాజీ వెల్లడించారు. మొత్తం 15 కౌంటింగ్ కేంద్రాల్లో లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. అందులో 7 కౌంటింగ్ సెంటర్లు అసెంబ్లీ నియోజిక వర్గాలకు 14 ఈవీఎం టేబుల్స్ రెండు పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్ ఉంటాయని, మాచర్ల, సత్తెనపల్లి నియోజకవర్గాలకు 3 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉంటాయన్నారు. అదేవిధంగా పార్లమెంట్ నియోజక వర్గానికి 7 హాళ్లలో సంబంధించి 14 ఈవీఎం టేబుళ్లు, 18 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లకు సంబంధించి వేరొక కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ రౌండ్లు ఇలా..

నియోజకవర్గం	బూత్‌ల సంఖ్య	రౌండ్ల సంఖ్య
పెదకూరపాడు	266	19
చిలకలూరిపేట	241	18
నరసరావుపేట	245	18
సత్తెనపల్లి	274	20
వినుకొండ	299	22
గురజాల	304	22

సినిమా చూడకుండానే రివ్యూ ఇస్తున్నారు



విష్వక్‌సేన్

'సినిమా చూసి నిజాయితీగా సమీక్ష రాయడంలో తప్పు లేదు. కానీ కొంత మంది సినిమా చూడకుండానే ఆ పని చేస్తున్నారు. మరికొందరు కావాలనే నెగెటివ్ రివ్యూలు రాస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రేక్షకులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాన్ని చూసేందుకు వస్తున్నారు' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా థియేటర్ల దగ్గర ప్రేక్షకుల సందడి కనిపించ లేదు. ఇప్పుడు మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కోసం మళ్లీ ప్రేక్షకులు థియేటర్ల బాట పడుతున్నారు. మా సినిమాకు వస్తున్న ప్రేక్షకాదరణకు చాలా ఆనందంగా ఉంది. 'విష్వక్ సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపుతారని ప్రశంసలు వస్తున్నాయి. నాలోని నటుడిగా సవాల్ విసిరేలా ఉంటేనే సినిమా చేయడం అలవాటు. ఇకముందు కూడా ఇలాంటి కొత్తదనం ఉన్న కథలతో వస్తాను' అన్నారు. 'బాలకృష్ణ గారు, వారి కుటుంబ సభ్యులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా బావుందని మెచ్చుకున్నారు. మంచి వసూళ్లు వస్తున్నాయని అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్లు ఫోన్ చేసి చెప్పారు. దీనికి త్వరలోనే సీక్వెల్ చేస్తాం' అని కృష్ణ చైతన్య చెప్పారు.

మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ

శర్వానంద్ హీరోగా నటించిన 35వ చిత్రం 'మనమే' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రకథానాయిక కృతి శెట్టి శుక్రవారం ఈ సినిమా విశేషాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేసిన నాకు ఈ పాత్ర చాలా కొత్తగా అనిపించింది. 'ఇంత స్ట్రిక్ట్‌గా ఉండాలా' అని దర్శకుడు శ్రీరామ్‌ను అడిగాను. అలాగే కావాలనడంతో ఆయన్ని ఫాలో అయ్యా
- శర్వానంద్ అద్భుతంగా నటించారు. నిన్నే సినిమా చూశా. ప్రతి సీన్‌లో ఆయన అదరగొట్టారు. ఇందులో నా ఫేవరెట్ సీన్ ఒకటుంది. దాని కోసం చాలా వెయిట్ చేశా. ఎలా చేయాలా అని ఆలోచించా. కానీ శర్వానంద్ చాలా క్యాజువల్‌గా వచ్చి ఒకే ఒక్క నిమిషంలో ఆ సీన్ చేయడంతో చాలా ఆశ్చర్యపోయా.
- స్ట్రాంగ్ ఎమోషన్స్ కలిగిన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ 'మనమే'. కిడ్, పేరెంట్ ఎమోషన్ కూడా ఉంది. గ్లోబల్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. శర్వానంద్, నేను, పాప.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. అందుకే 'మనమే' అని పేరు పెట్టారు.
- చిత్రం షూటింగ్ లండన్‌లో జరిగింది. అక్కడి వెదర్ ఎప్పటికప్పుడు మారిపోయేది. ఒక్కోసారి హఠాత్తుగా వర్షం పడేది. అటువంటి వాతావరణంలోనూ నిర్మాత చక్కగా ప్లాన్ చేయడం వల్ల షూటింగ్ బాగా జరిగింది.
- ప్రస్తుతం మూడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే ఓ మలయాళ సినిమా కూడా చేస్తున్నాను.





జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం

సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ థియేట్రికల్ ట్రైలర్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సుధీర్‌బాబుకు, టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సుధీర్‌బాబు రాంబోలా ఉంటాడు. ఇందులో జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం అని చెప్పడం ఆసక్తికరంగా ఉంది. రాయలసీమ యాస లో సుధీర్ బాబు అద్భుతంగా మాట్లాడారు. ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ కావాలి' అని కోరారు. 'ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు సంపత్ నంది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'యాక్షన్ సినిమా చేయమని కృష్ణ గారు చాలా సార్లు చెప్పారు. ఈ సినిమా ఆయనకు ఆనందం కలిగిస్తుందని నమ్ముతున్నా. ఇండియన్ సినిమాలో 'హరోంహర' లాంటి బ్యాక్‌డ్రాప్ ఉన్న సినిమా రాలేదనే చెప్పాలి. యాక్షన్ సీన్లు టాప్ రేంజ్‌లో ఉంటాయి. నిర్మాతలు బాగా ఖర్చు పెట్టారు. దర్శకుడు సాగర్ ఈ సినిమా కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించారు' అని చెప్పారు. జూన్ 14న సుధీర్‌బాబు మాస్ సంభవం చూడబోతున్నారని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/4uAYVEx లో చదవండి.



దిక్సూచి
DIKSUCHI

ఎంటెక్



సిడాక్-ఈఆర్‌డీసీఐఐటీ

తిరువనంతపురంలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)కు చెందిన ఈఆర్&డీసీఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఈఆర్‌డీసీఐఐటీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ ఇంజనీరింగ్(ఎంటెక్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా లైవ్ ప్రాజెక్ట్ వర్క్‌లు, సిడాక్ ఆర్ అండ్ డీ ల్యాబ్స్‌లో ఇంటర్న్‌షిప్ ఉంటాయి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: వీఎల్ఎస్ఐ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. సైబర్ ఫోరెన్సిక్స్ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే నాన్ గేట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. వీరికి డిగ్రీ స్థాయిలో ఆరో సెమిస్టర్ వరకు వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 6
- **ఈ-మెయిల్:** erdciit@cdac.in
- **వెబ్‌సైట్:** http://erdciit.ac.in

మౌలానా ఆజాద్ వర్సిటీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి.

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఐఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 15
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 26 నుంచి
- **వెబ్‌సైట్:** https://manuu.edu.in

డా.వైఎస్సార్‌హెచ్‌యూలో డిప్లొమాలు

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి.

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-02/2024) నోటిఫికేషన్ విడుదలైంది. కోర్సు 2025 జూలైలో ప్రారంభం కానుంది.

1. **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)
2. **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్

అర్హతలు: ఇంటర్(ఫిజిక్స్, మేథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టం పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 28

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 9, 10, 11

వెబ్‌సైట్: https://afcat.cdac.in/AFCAT/

యూపీఎస్సీ ఎన్‌డీఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. త్రివిధ దళాల్లో 2025 జూన్ 2 నుంచి ప్రారంభం అయ్యే 154వ కోర్సులో, 116వ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏసీ) కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. అర్హులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- యూపీఎస్సీ - నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(2)-2024

ఖాళీలు: మొత్తం 404. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-120) ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 34 ఉన్నాయి.

అర్హత: ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



వయసు: అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 2006 జనవరి 1కి ముందు, 2009 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

కోర్సులు: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 1

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

వెబ్‌సైట్: https://upsc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gliKhrpలో చదవండి.







ఎన్నికల అధికారికి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమ తదితరులు

ఆ ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల ప్రధాన అధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు

నరసరావుపేట, మే 31: పల్నాడు జిల్లా ఎన్నికల విధుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ అనేక అక్రమాలకు పాల్పడిన డీపీవో విజయభాస్కర్ రెడ్డి, డీఆర్వో వినాయం రెడ్డి, పూడా డిప్యూటీ ఛైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు శుక్రవారం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుంటూరు మిర్చియార్డ్ మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ ముగ్గురు అధికారులు పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని నియమించడం, ఇతర అనుమతులు, తదితర అంశాలలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికల విధులకు సచివాలయ, వీఆర్వోలు, వీఏవోలు తదితర విభాగాల్లో సిబ్బందిని నియమించారు. 4న జరిగే కౌంటింగ్ సమయంలో వీరు వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిఫార్సుల మేరకు వీరిని ఎన్నికల విధుల్లో భాగంగా అత్యంత కీలకమైన పోస్టుల్లో వీరిని నియమించారు. ఈ సమాచారాన్ని ఏప్రిల్ 15వ తేదీన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేయడం జరిగింది. సదరు ఫిర్యాదుపై విచారణ కోసం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌కు పంపించారు. విచారణ అధికారిగా డీఆర్వో వినాయం రెడ్డిని నియమించారు. కేసును నీరుగార్చడానికే వినాయం రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆయన తప్పుడు నివేదిక ఇవ్వడంతో విజయభాస్కర్ రెడ్డిని అక్కడే కొనసాగించారని పేర్కొన్నారు. మాచర్లలో ఈవీఎం పగుల గొట్టడంలో, పోలింగ్ బూత్‌ల్లో దౌర్జన్యంగా ప్రవేశించి పోలింగ్ ఏజెంట్లను వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురిచేయడంలో, ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగడానికి విజయభాస్కర్ రెడ్డి, వినాయం రెడ్డి, గజ్జల శ్రీనివాస రెడ్డిలదే పూర్తి బాధ్యత. వీరిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘంను కోరారు.



జై హనుమాన్..

వినుకొండటౌన్, మే31: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాద్ గీసిన నాగవల్లి హనుమాన్ చిత్రం పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. సంస్కృతంలో తమలపాకుకు పర్యాయపదం నాగవల్లి. ఈ సందర్భంగా ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

సజ్జలపై కేసు నమోదుతో వైసీపీలో వణుకు

● ఇప్పటికే పిన్నెల్లి వ్యవహారంతో దడ ● టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారికి ముచ్చెమటలు



ధ్వంసమైన టీడీపీ కార్యాలయం (పాతచిత్రం)

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో వణుకు మొదలైంది. ఫలితాలు వెలువడటానికి ముందే భవిష్యత్ కళ్ళకు కనపడుతుండటం తో చాలా మంది నేతలు బెంబేలెత్తుతున్నారు. తాజాగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా కేసు నమోదు కావడం తో వైసీపీలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇంత కాలం తమకు ఎదురు లేదన్న రీతిలో చట్టాన్ని ధిక్కరించి, అక్రమాలకు పాల్పడిన వైసీపీ చోటా, మోటా నేతలకు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పిచ్చెక్కిస్తున్నాయి. గత ఐదేళ్ళ కాలంలో చాలా మంది వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు మాచర్ల నమూనాను ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు పరిచారు. అదేమని నోరెత్తిన వారిపై దమన కాండకు పాల్పడ్డారు. ముఖ్యంగా రాజధాని ఉద్యమం సందర్భంగా ఆ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నేతలు అక్కడి మహిళలపై చాలా అమానుషంగా ప్రవర్తించారు. వారు చేస్తున్న ఉద్యమాన్ని వెక్కిరించడంతోపాటు చివరకు వ్యక్తిగతంగా కూడా విమర్శిస్తూ వచ్చారు. చాలా సందర్భాల్లో ఉద్యమ శిబిరాలపై బహిరంగ దాడులకు ప్రేరేపించారు. మహిళలని కూడా చూడకుండా భయంకరంగా కొట్టించారు. అప్పట్లో ఈ వ్యవహారంపై మీడియా గొంతు ఎత్తినప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా పెద్దగా పట్టించుకోలేదు. పైగా దాడులకు పాల్పడిన నాయకులకు అండగా నిలబడ్డారు. అదేమని ప్రశ్నించిన మీడియాపై సైతం కేసులు పెట్టి కోర్టులు చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఇటువంటి సంఘటనలు చాలా జరిగాయి. స్థానిక సంస్థలు ఎన్నికల సందర్భంగా మహిళలు నామినేషన్లు వేయడానికి వెళ్తే కూడా వారిపై వైసీపీ రౌడీ మూకలు బహిరంగంగానే దాడులకు తెగబడ్డారు. నామినేషన్ పత్రాలను చించి వేయడమే కాకుండా, గాయాలయ్యేటట్లు వారిని కొట్టడం జరిగింది. మాచర్లలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అక్కడికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ నేత బుద్దా వెంకన్నపై బహిరంగంగా దాడికి పాల్పడ్డారు. ఆయన కారును కూడా ధ్వంసం చేశారు. ఆఖరికి వాట్సాప్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఒక మెసేజ్‌ను ఫార్వార్డ్ చేసిన ఓ వృద్ధ మహిళపై సైతం విచారణ పేరుతో పోలీసులను ఉసి గొలిపి వేధించారు. హోటల్ వ్యాపారం నిర్వహించే ఆ మహిళ వీరి వేధింపులను తాళలేక వ్యాపారాన్ని సైతం వదిలేసుకొని తెలంగాణలో తలదాచుకుంటున్నారు. జిల్లాకు చెందిన సీనియర్ టీడీపీ నేత ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌పై అక్రమంగా కేసులు నమోదు చేపించి జైలు పాలు చేయించటంలో కూడా సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ప్రధానంగా ఉంది. పొన్నూరు నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచిన నరేంద్ర ఆధ్వర్యంలో సంగం డెయిరీ ఉండటమే ఇందుకు కారణం. సంగం డెయిరీ పైనే కాకుండా దానికి అనుబంధంగా రైతులకు రాయితీపై సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్న డీవీసీ హాస్పటల్‌పై కూడా వారి కన్ను పడింది. నరేంద్రను జైలు పాలు చేసి ఆ రెండింటిని వైసీపీ నేతల హస్తగతం చేసేందుకు చేసిన పన్నాగాన్ని నరేంద్ర న్యాయస్థానం అండతో తిప్పి కొట్టారు. ఇక టీడీపీ శ్రేణులు దేవాలయంగా భావించే పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటమే కాకుండా దైవ సమానంగా భావించే పార్టీ అధినేత చంద్రబాబును సైతం జైలు పాలు చేయటాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ అక్కసు తీర్చుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నారు. తాజా పరిణామాలతో అటువంటి నేరాలకు పాల్పడిన నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. వైసీపీకి చెందిన ముఖ్య నేతలపైనే కేసు నమోదు చేయటం, వాళ్ళు ఊర్లు వదిలి పారిపోవటం వంటివి జరు గుతుండటంతో కిందిస్థాయి నేత లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మాచర్ల నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి సోదరుల అండ చూసుకొని రెచ్చిపోయిన కింద స్థాయి వైసీపీ నాయకులు పోలీస్ పేరు చెబితే హడలి పోతున్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి...

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని సంఘటనలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో జగన్ పాలనలో జరిగాయి. జిల్లాలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై, కరకట్ట మీద వున్న చంద్రబాబు ఇంటి పైన కూడా వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డారు. ఒక్కసారిగా వందలాది మందితో దేవినేని అవినాష్, జోగి రమేష్ ఈ దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో గుంటూరు జిల్లాకు చెందిన నాయకుల పాత్ర కూడా ఉంది. ఈ రెండు ఘటనలపై స్వయంగా చంద్రబాబు నాయుడు డీజీపీ దృష్టికి తీసుకువెళ్లినా పెద్దగా స్పందించలేదు. డిజిపి కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఇంత విధ్వంసం జరుగుతున్నా అధికారుల స్పందన లేకపోవడం గమనార్హం. ఈ దాడి ద్వారా పైశాచిక ఆనందం పొందిన జగన్ ఆ మేరకు అధికారులను కంట్రోల్ చేయగలిగారు. ఇప్పుడు ఆ దాడుల్లో పాల్గొన్న నేతల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

రెచ్చిపోయి అక్రమాలు..

జిల్లాలోని వైసీపీ నేతలు గత ఐదేళ్ళ కాలంలో సాగించిన అక్రమాలు చెప్పడానికి రోజులు సరిపోవు. తమను అడిగే వాడు ఎవ్వడు అంటూ రెచ్చిపోయారు. జిల్లాలోని మైన్స్‌ను కొల్లగొట్టారు. ఇసుక రీచ్‌లలో అయితే అక్కడ కడప మాఫీయాను కాపలా పెట్టి మరీ తవ్వకాలు జరిపారు. రీచ్‌లు చూసేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై కూడా గొడ్డళ్లు, వేట కొడవళ్లతో దాడులకు పాల్పడ్డారు. కొందరిపై ట్రాక్టర్లు కూడా ఎక్కించి చంపబోయారు. రేషన్ మాఫియా, మట్టి మాఫియా, మద్యం మాఫియా ఇలా జిల్లాలో కొన్ని వేల కోట్లు వైసీపీ నేతలు అడ్డగోలుగా సంపాదించారు. ఇప్పుడు ఆ నేతలు తాము చేసిన అక్రమాలకు ఎన్ని కేసులు పెడతారో అన్న భయం వెంటాడుతోంది. ఈ అక్రమాలన్నీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాడేపల్లి ప్యాలెస్ కొలువు తీరిన ప్రభుత్వ సలహాదారు సజ్జల నేతృత్వంలోనే జరిగాయనేది అందరికీ తెలిసిందే. ఆదేశాలు ఇచ్చేది సీఎం జగన్ అయినప్పటికీ అమలు చేసే బాధ్యత అంతా సజ్జల కనుసన్నలలోనే.

రెంటచింతలలో భానుడు భగ భగలు



చెట్టునీడన మూగజీవాలు

రెంటచింతల, మే 31: రోహిణికార్తె తన ప్రభావాన్ని చూపిస్తోంది.. భానుడు భగ భగ మంటూ నిప్పులు కురిపించాడు.. నడినెత్తిన నిప్పుల కుంపటి పెట్టినట్లుగా వుందని మండల వాసులు వాపోతున్నారు. రెంటచింతలలో శుక్రవారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 46 డిగ్రీలుగా నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపించాడు. ఎండకు తోడు వడగాల్పులు కూడా వీచాయి. ఇళ్లలోంచి జనం బయటకు రావడానికి వెనుకంజ వేశారు. ఉక్కపోతతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, పిల్లల బాధ వర్ణణాతీతం. నిత్యం రీద్దతో ఉండే రహదారులు కళావిహీనంగా దర్శనమిచ్చాయి. ఇక నోరు లేని మూగ జీవాల బాధ వర్ణణాతీతం. చెట్లు, పుట్ట నీడన ఉపశమనం పొందాయి.

వారధిపై బ్రేక్‌డౌన్

● ఉదయం ఓ లారీ.. సాయంత్రం మరో లారీ

● విజయవాడ - గుంటూరు మార్గంలో ట్రాఫిక్‌జాం

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గుం టూరు మార్గంలో రాకపోకలు సాగించాలంటే వారధి దాటా ల్సిందే. ఈ మార్గంలో వారధిపై ఏదైనా వాహనం ఆగిపోయిం దంటే మిగిలిన వాహనదారులు చుక్కలు చూడాల్సి వస్తోంది. శుక్రవారం సరిగ్గా ఇదే జరిగింది. వారధిపై విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే మార్గంలో ఉదయం ఒక లారీ, గుంటూరు నుంచి విజయవాడ వచ్చే మార్గంలో సాయంత్రం ఒక లారీ సాంకేతిక కారణాలతో ఆగిపోవడంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం భారీ లారీ ఆగిపోవడంతో తాడేపల్లి వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. గంటకు పైగా వాహన దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ద్వి చక్రవాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ సాయంత్రం ఐదు గంటల తర్వాత విజయవాడ - గుంటూరు మార్గంలో మరో లారీ వారధిపై ఆగిపోయింది. దీంతో కృష్ణలంక, స్క్రూ బ్రిడ్జి వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. వారధిపై నుంచి ఆగిపోయిన లారీలను తొలగించిన తర్వాత ట్రాఫిక్ మామూలు పరిస్థితికి వచ్చింది.

కానిస్టేబుల్.. రైతులా..

● వ్యాపారిని వలపన్ని పట్టుకున్న అధికారులు



విత్తనాలు పట్టుకున్న అధికారులు

గుంటూరు సిటీ, మే 31: విత్తనాల వ్యాపారి ఆటకట్టించేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కానిస్టేబుల్‌నే రైతులా మార్చారు. నగరంలోని రాజాగారి తోటలో ఉన్న కుబేరా సీడ్స్‌కు రైతు అవతారంలో వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ పోలిరాజు రెండు రకాలకు చెందిన విత్తనాలు కావాలని అడిగారు. ఆ విత్తనాలు తమ దగ్గర స్టాక్ లేవని చెప్పిన షాపు యజమాని నో స్టాక్ బోర్డ్ చూపించారు. వెంటనే రంగ ప్రవేశం చేసిన విజిలెన్స్ అధికారులు సదరు వ్యాపారి రికార్డులు, గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రైతులకు అమ్మకుండా, బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయించేందుకు వ్యాపారి వాటిని దాచినట్లు కేసు నమోదు చేశారు. బాలాజీ సీడ్స్, శ్రీ రామా సీడ్స్‌లో కూడా హైబ్రిడ్ మిరప విత్తనాలను పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులు రెడ్డి, ఏవో రమణ కుమార్, బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఏపీ ఉపాధ్యాయ సంఘ నాయకుడు దశపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూఎస్ నాయకులు దశపతిరావు

గుంటూరు(విద్య), మే 31: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా నాయకులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) నాయకుడు కె.దశపతిరావు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో అరండల్‌పేట యోగిభవన్‌లో శుక్రవారం నిర్వహించిన అభ్యాసవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, ఉద్యోగోన్నతులు, బదిలీల్లో జరిగే సమస్యల గురించి తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు, పదో తరగతి మారిన సిలబస్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిక్షణా తరగతుల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కె.నాగభారతి, డి.శివపార్వతి, మురళీకృష్ణ, వై.రమ, ఆదినారాయణ, డి.రామాంజనేయులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో గుంటూరు వైద్య విద్యార్థుల ప్రతిభ

న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు



డాక్టర్ కన్నెగంటి వినీత డాక్టర్ అత్తోట అఖిల్

గుంటూరు (మెడికల్), మే 31: ప్రతిష్టాత్మక న్యూఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) జాతీయ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో గుంటూరుకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చారు. మెడికల్, సర్జికల్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి తెలుగు వారి సత్తాను చాటారు. ఎయిమ్స్ న్యూఢిల్లీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ (ఐఎన్ఐ ఎస్ఎస్) రుమటాలజీ ప్రవేశ పరీక్షలో గుంటూరుకు చెందిన డాక్టర్ కన్నెగంటి వినీత మొదటి ర్యాంకు సాధించారు. ఎంబీబీఎస్‌ను ఎయిమ్స్‌లో పూర్తి చేసిన వినీత, చండీఘర్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో జనరల్ మెడిసిన్‌ను పూర్తి చేశారు. గుంటూరుకు చెందిన డాక్టర్ అత్తోట అఖిల్ ఎయిమ్స్ న్యూఢిల్లీలో ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సు ఎంట్రన్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ విభాగంలో సెకండ్ ర్యాంక్ సాధించారు. చినకాకానిలోని ఎన్నారై మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అఖిల్, విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి జనరల్ సర్జరీ చేశారు. పీజీ కోర్సులో అతడు గోల్డ్ మెడల్ సాధించారు. అఖిల్ తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యనిపుణులే. తండ్రి డాక్టర్ అత్తోట సతీష్‌బాబు జనరల్ సర్జన్‌గా, తల్లి డాక్టర్ అత్తోట కవిత చర్మవ్యాధుల వైద్యనిపుణులుగా ప్రాక్టీసు చేస్తున్నారు. వీరి కుటుంబంలో మొత్తం 13 మంది వైద్యులు ఉండటం విశేషం.



వెంకటపాలెంలో జై అమరావతి నినాదాలు చేస్తున్న రాజధాని మహిళలు

వైసీపీ అడ్డగోలు పాలనకు అంతం తప్పదు

1627వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే31: వైసీపీ అడ్డగోలు పాలనకు అంతం తప్పదని, రాష్ట్రాభివృద్ధిని మరచి, రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసినందుకు ప్రజలు ఇచ్చే అంతిమ తీర్పు అదేనని 33వేల ఎకరాలు రాజధాని కోసం త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1627వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడారు. మూడు రాజధానులని అమరావతికి అన్యాయం చేస్తున్నారని వైసీపీ పాలనపై శాంతియుత ఉద్యమం చేస్తుంటే ఆడవారని చూడకుండా లాఠీచార్జ్ చేసి అక్రమ కేసులు వైసీపీ సర్కార్ పెట్టిందన్నారు. పరిపాలన చేత కాని వారికి అధికార పగ్గాలు ఇస్తే.. అంతా విధ్వంసం అవుతుందనటానికి ఈ ఐదేళ్ల వైసీపీ పాలనే నిదర్శనమన్నారు. మూడు ముక్కలాట పెట్టి రాష్ట్ర ప్రజల జీవితాలతో సీఎం జగన్‌రెడ్డి ఆడుకున్నాడని పేర్కొన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు నిరసన దీక్షలు కొనసాగాయి.

ఏఎన్‌యూ ఐసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), మే 31: ఏఎన్‌యూ ఐసెట్- 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ఏఎన్‌యు ఐసెట్ ద్వారా విశ్వవిద్యాలయంలో ఏడు కోర్సులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎంబీఏ జనరల్, ఎంసీఏ, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్, ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్, ఎంబీఏ టూరిజం హాస్పిటాలిటీ మేనేజ్మెంట్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్, ఎంబీఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ కోర్సులలో ప్రవేశాలు ఉంటాయని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆఫ్‌లైన్ విధానంలో జూన్ 5వ తేదీలోగా ఎటువంటి ఫైన్ లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే 750 రూపాయల ఫైన్‌తో జూన్ 12వ తేదీలోగా, వెయ్యి రూపాయల ఫైన్ తో జూన్ 18వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష జూన్ 18న నిర్వహించే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయంలోని పీజీ ప్రవేశాల విభాగాన్ని లేదా ఏఎన్ యూ వైబ్‌సైట్ సంప్రదించాలని ఆమె సూచించారు.

భార్య మృతికి కారకుడైన భర్తకు జైలు

నరసరావుపేట లీగల్, మే 31: వరకట్న వేధింపుల నేపథ్యంలో భార్య మృతికి కారకుడైనట్టు నేరం రుజువవ్వటంతో నిందితుడు ఫిరంగిపురంకు చెందిన షేక్ గౌస్‌కు వివిధ నేరాల ప్రకారం ఎనిమిది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5500 జరిమానా విధిస్తూ స్థానిక ప్రధాన సహాయ సెషన్స్ న్యాయమూర్తి ఏ పూర్ణిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిందితుడికి 2007లో గుంటూరుకు చెందిన మొబీనాతో వివాహం మైంది. ఆ సందర్భంగా రూ 5 లక్షలు నగదు, 30 సంవర్ల బంగారం, మూడు సెంట్ల స్థలం, ఓ మోటారు సైకిల్‌ను ఇచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు దుర్వ్యసనాలకు లోనై భార్యను అదనపు కట్నం కోసం వేదిస్తున్నాడని, ఈ నేపథ్యంలో విసిగి వేసారి మొబీనా 2019 నవంబరు 10న ఉదయం ఉరి వేసుకొని చనిపోయింది. ఈ మేరకు మృతురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో శిక్ష మొత్తాన్ని ఏక కాలంలో అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ కేతు స్వర్ణలత భాను నిర్వహించారు.

సర్వేలు.. లోడింగ్!

● నేటి సాయంత్రానికి అన్ని సర్వేలు వెల్లడి.... ● బెట్టింగ్ రాయుళ్ళలో ఆత్రుత



గుంటూరు, మే31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఫలితాలు వెలువడేది వాస్తవానికి నాలుగో తేదీ అయినప్ప టికీ శనివారం వెలువడే వివిధ సర్వే సంస్థల ఫలితాలనే ముందస్తు ఎన్నికల ఫలితాలుగా భావిస్తున్నారు పందెం రాయుళ్ళు కొన్ని సర్వే సంస్థలు గతంలో ఇచ్చిన ముఖ్యంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నూటికి నూరు పాళ్ళు నిజం కావటంతో ఆ సంస్థల ఫలితాలపై తమ భవితవ్యం ఆధారపడి ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా కొన్ని వందల కోట్లలో పందేలు జరిగాయి. అయితే గతంలోలా ఈ పర్యాయం రూపాయికి రూపాయి పందేలు జరగలేదు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ముఖ్యంగా ఉద్యోగ, వ్యాపారవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆ పార్టీకి చెందిన వారే పోలింగ్ తేదీ నాటికి గమనించటంతో పందేలు వేసేందుకు ఈసారి హుషారుగా ముందుకు రాలేదు. దీంతో ఎక్కువ శాతం కోసు పందేలే జరిగాయి. రూపాయికి రూపాయన్నరే కాకుండా రెండు రూపాయల పందేలు కూడా జరిగాయి. గత ఎన్నికల్లో పోలింగ్ తేదీ రోజున ఓటరు నాడి అర్థం కాకపోవటంతో టీడీపీ తరపున బెట్టింగ్ రాయుళ్ళు భారీ ఎత్తున పందేలు వేసి రూ.కోట్లలో నష్టపోయారు. ఈ పర్యాయం వాటిని పూడ్చుకునేందుకు కూటమి తరపున భారీ ఎత్తున పందేల కు సిద్ధమైనప్పటికీ ఆశించిన రీతిలో వైసీపీ తరుపున పందెం వేసేందుకు బెట్టింగ్ రాయుళ్ళు ముందుకు రాలేదు. దీంతో వారిని బరిలోకి దించేందుకు కోసు పందేలకు దిగాల్సి వచ్చింది. కాగా తమ ప్రభుత్వం వస్తుందని వైసీపీ తరుపున పందేలు వేసేవారు రాకపోవటంతో వైసీపీకి 70కి మించి రావని కొన్ని పందేలు జరుగుతున్నాయి. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లా వరకు కూటమికి 24 సీట్లు వస్తాయని కొన్ని మొదట్లో కొన్ని పందేలు జరిగాయి. ప్రస్తుతం అదే పందెం 32 సీట్లు వస్తాయని జరుగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17 స్థానాల్లో గాను వైసీపీకి ఐదు కూడా రావని రూపాయికి రూపాయి కొన్ని బెట్టింగ్‌లు జరిగాయి. అలాగే ఉమ్మడి జిల్లాలో వైసీపీకి మూడు కూడా రావని కూటమి తరుపున పందెం కాశారు. మూడు రాని పక్షంలో వైసీపీ తరుపున పందెం వేసే వారు రూపాయికి రెండు రూపాయలు ఇచ్చే విధంగా బెట్టింగ్‌లు జరిగాయి. ఒకటో తేదీ సాయంత్రానికి తమ తమ సర్వేలు వెలువరించేందుకు ఆయా సంస్థలు రంగం సిద్ధం చేసుకున్నాయి.

మైనార్టీ గురుకుల పాఠశాల అడ్మిషన్లు

గుంటూరు(విద్య), మే 31: మైనార్టీ గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాల కోసం బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని నందివెలుగు రోడ్డులో బాలుర కోసం, పొన్నూరు రోడ్డులో బాలికల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 12లోగా స్వయంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 8712625039, 6302018886లో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	286.00
చికెన్ స్కిన్ లెస్	296.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

చంద్రబాబును కలసిన కన్నా



నారా చంద్రబాబు నాయుడును కలసిన కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మే31: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును హైదరాబాద్‌లోని ఆయన గృహంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాత, నవ్యాంధ్ర ఉజ్వల భవిష్యత్ సాధనే లక్ష్యంగా త్వరలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న దార్శనికులు చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలసినట్టు పేర్కొన్నారు.

భక్తాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి, మే 31: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో, వివిధ ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకాలు, హనుమత్ హోమం, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రజలు సంయమనం పాటించాలి

● కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి



మాచర్లటౌన్, మే 31: నియోజకవర్గ పరిధిలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలు సంయమనం పాటించాలని కూటమి అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు కూటమి వైపే ఉందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా, రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సంయమనంతో ఉండాలన్నారు. ఓటమి భయంతో వైసీపీ కవ్వింపునకు దిగుతోందని, అందరూ అప్రమత్తంగా ఉంటూ వివాదాలకు దూరంగా ఉండాలని అన్నారు. మన నినాదం పల్నాడు ప్రాంత అభివృద్ధి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పల్నాడు ప్రాంతంలో శాంతి కుసుమాలు విరిసేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉండాలని బ్రహ్మారెడ్డి కోరారు.

కౌంటింగ్ రోజు విధ్వంసం సృష్టించేందుకు వైసీపీ కుట్ర


మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాశయ్య



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

క్రోసూరు, మే 31: కౌంటింగ్ రోజు విధ్వంసం సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తున్నదని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. శుక్రవారం పలువురు టీడీపీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కౌంటింగ్ రోజు అలజడులు సృష్టించి గెలుపొందాలని చూస్తున్నారని, దీనికి కొంతమంది ఆర్‌వోలు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టేలా సజ్జల ప్రయత్నించటం, కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేయటం దారుణమన్నారు. ఎలక్షన్ కమిషన్‌తో పాటు పోలీసులు కూడా ఈ వ్యాఖ్యలను పట్టించుకోకపోవటం శోచనీయం అన్నారు. వెంటనే సజ్జల రామకృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు కౌంటింగ్ పూర్తయ్యేవరకు కుట్రలు చేస్తున్న నాయకులను అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కౌంటింగ్ రోజు రూల్స్ పట్టించుకోవాల్సిన అవసరం లేదని, అధికారులు ఎవ్వరినీ లెక్కచేయాల్సిన అవసరం లేదని, కౌంటింగ్ కేంద్రాల్లో తిరగబడాలని, సాధ్యమైనంత వరకు అలజడి సృష్టించాలని రామకృష్ణారెడ్డి తమ కార్యకర్తలను రెచ్చగొట్టడం వారు చేస్తున్న దుర్మార్గమైన చర్యల్లో భాగమన్నారు. వీరిని ముందస్తు అరెస్టులు చేస్తేనే కౌంటింగ్ ప్రశాంతంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలతో గతంలో ఎన్నడూ లేనివిధంగా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటికే తాము ఓడిపోతామని గ్రహించిన అధికార పార్టీ నాయకులు కుతంత్రాలతో టీడీపీ గెలుపును అడ్డుకోవాలని చూడటం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాంద్రు మైనూర్‌బాబు, సాంబయ్య, కుంభా ఏడుకొండలు, కే అమరయ్య, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, దుద్దుల యోహాన్, షేక్ హసాన్, కాంద్రు రామయ్య, పరిశ హనుమంతరావు, దారెడ్ల సీతారెడ్డి, మాజీ ఎంపీపీ అనుమల వెంకట రామిరెడ్డి, బీసీ నాయకులు ఆది శ్రీను, ఊరె రోశయ్య పార్టీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల నమోదుకు ఆన్‌లైన్ ఇబ్బందులు తొలగించాలి



ఉపాధి పథకం ఏపీవోకు వినతి పత్రం సమర్పిస్తున్న పెరికపాడు ఉపాధి కూలీలు

క్రోసూరు, మే 31: ఉపాధి హామీ పథకం నమోదుకు సంబంధించిన ఆన్‌లైన్ ఇబ్బందులను తొలగించి తాము పనిచేయటానికి ఆటంకం లేకుండా చేయాలని మండలంలోని పెరికపాడు గ్రామానికి చెందిన పలువురు ఉపాధి హామీ కూలీలు కోరారు. పనులు చేయటానికి సాంకేతిక ఇబ్బందులు తలెత్తినందున తాము పని చేయటానికి వీలుకావటం లేదని, ఉపాధి హామీ పథకం సిబ్బంది అనుమతించటం లేదని వారు అన్నారు. రెండు రోజులుగా పనులు లేక, కూలి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సిబ్బందిని అడిగితే తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని చెపుతున్నారని, వెంటనే ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఏపీవో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. పెరికపాడు గ్రామానికి చెందిన సుమారు పది మంది కార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పల్నాడును మంచి జిల్లాగా మార్చడమే లక్ష్యం

- పల్నాడు జిల్లా ఎస్పీ మాలికా గార్గ్



దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మాలికా గార్గ్

దాచేపల్లి, మే 31: పల్నాడు జిల్లాను ప్రశాంతమైన జిల్లాగా మార్చడమే నా ముందున్న లక్ష్యమని పల్నాడు జిల్లా ఎస్పీ మాలికా గార్గ్ అన్నారు. శుక్రవారం దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాల్లో వివిధ కేసులలో నిందితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశం మొత్తం కూడా పల్నాడు జిల్లా వైపు చూస్తున్నదని ఆమె అన్నారు. గొడవలలో ఏమి సాధించారని ప్రశ్నించారు. భార్యాబిడ్డలకు దూరమై మీరు సాధించింది ఏమిటంటూ పేర్కొన్నారు. చిన్న తప్పును కూడా సహించను.. చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. మీరంతా చిన్నచిన్న కుటుంబాలు, చిన్న వ్యాపారాలు, వ్యవసాయం చేసుకుని జీవించే వ్యక్తులు. ఎవరి కోసమో బాంబులు వేసుకోవడం, కర్రలతో దాడులు చేసుకోవడం వంటి చర్యలతో నష్టపోయేది మీరేనన్నారు. ఇకనుండి ప్రశాంతంగా వుంటామని, ఎటువంటి ఘర్షణలకు పాల్పడమని, వివిధ కేసులలోని వ్యక్తుల నుండి హామీ తీసుకున్నారు. జూన్ 1వ తేదీన ఎగ్జిట్ పోల్స్ వస్తాయి... 4న ఎన్నికల ఫలితాలొస్తాయి.. ఆ రోజు బాణసంచా కాల్చడం, డీజేలు పెట్టడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, దాడులు చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. 14వ తేదీ నుండి జూన్ 6 వరకు 144 సెక్షన్ అమలులో వుందంటే పరిస్థితి ఏవిధంగా వుందో అర్థం చేసుకోవచ్చు... అంటూ ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ జగదీష్‌నాయక్, తహసీల్దార్ గీతావాణి, ఎంపీడీఓ వెంకటరమణ, దాచేపల్లి కమిషనర్ నారాయణమూర్తి, ఎస్‌ఐలు శివనాగరాజు, సంధ్యారాణి తదితరులున్నారు.

ఖాళీ అవుతున్న రక్త నిల్వలు

● రోగులకు గడ్డు పరిస్థితులు



ఏరియా వైద్యశాలలో రక్త నిల్వల బోర్డు

సత్తెనపల్లి, మే 31: సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో రక్తం అత్యవసరమైన బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏప్రిల్ నుంచి ఈ కొరత ఏర్పడింది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు డెలివరీల నిమిత్తం వచ్చిన మహిళలకు అవసరమైన గ్రూపు రక్తం సమకూర్చుకోవటం కష్టంగా మారింది. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో కూడా శస్త్రచికిత్సలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నెలలో 40 నుంచి 50 యూనిట్ల వరకు రక్తం అవసరమవుతుంది. అత్యవసరమైన వారికి వారి బంధువుల నుంచి రక్తం సేకరించి నరసరావుపేట బ్లడ్‌బ్యాంక్‌లో ఉన్న రక్తం ప్యాకెట్లను సర్దుబాటు చేస్తున్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఉన్న రక్త నిల్వ కేంద్రానికి నరసరావుపేట ఆస్పత్రి నుంచి నెలకు 30నుంచి 40 యూనిట్లు మాత్రమే రక్తం తెప్పిస్తున్నారు. ఇవి రోగులకు సరిపోవటం లేదు. సత్తెనపల్లి తదితర గ్రామాల నుంచి ఏరియా వైద్యశాలకు వచ్చే గర్భిణుల్లో రక్తహీనత ఎక్కువ కన్పిస్తుండటంతో వైద్యులు అవసరాన్ని బట్టి రెండు యూనిట్ల వరకు రక్తమెక్కిస్తున్నారు. రక్తం అందుబాటులో ఉండకపోవటంతో తప్పనిసరి పరిస్థితుల్లో నరసరావుపేట, గుంటూరు వెళ్ళి గర్భిణుల బంధువులు ఎక్కువ ధరకు రక్తం కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. బీ నెగిటివ్ లాంటి రక్తం ఒక్కోసారి లభ్యం కావటం లేదు. రోగికి సంబంధించిన బంధువులు ఎవరైనా రక్తదానం చేస్తే వారివద్ద నుంచి రూ.1150 నుంచి రూ.1200 వరకు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల్లో డబ్బులు వసూలు చేసి రక్తం సరఫరా చేస్తున్నారు. రక్తం సేకరించిన తరువాత 35 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. అనంతరం పనికిరాకుండా పోతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రోగులకు అవసరమైనంత రక్తం లభ్యం కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా వైద్యశాలలో రక్త నిల్వలు, సామర్థ్యం 40 శాతం మాత్రమే అందుబాటులో ఉంటుంది. రెండు నెలల నుంచి 60 యూనిట్లలోపే రక్తం అందుబాటులో ఉంటోంది. కొన్ని సందర్భాల్లో రెండు నుంచి నాలుగు యూనిట్ల వరకు రక్తం అందుబాటులో ఉండటం లేదు. ఈ విషయంపై ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో రక్తనిల్వలు తక్కువగా ఉన్నమాట వాస్తవమేనన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నరసరావుపేటలోని రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తం తెప్పిస్తున్నామన్నారు. ఎక్కడ రక్త నిల్వలు కావాలన్నా దాతలు, రక్తదాన శిబిరాలే ఆధారమన్నారు. రక్తం నిల్వలు ఎప్పటికప్పుడు తగినంత ఉండటం కోసం కళాశాలలు ప్రారంభం అనంతరం ప్రత్యేక శిబిరాల ద్వారా రక్తం సేకరిస్తే కొరత ఉండదని తెలిపారు. వేసవి సెలవులు కావటంతో విద్యార్థులు అందుబాటులో లేరని, దీంతో రెండు నెలలుగా సమస్య తీవ్రంగా ఉందని ఆయన తెలిపారు.

పెరుగుతున్న కాన్పులు

సత్తెనపల్లి, మే 31 : సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో డెలివరీలు లక్ష్యానికి మించి చేస్తున్నట్టు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ముగ్గురు గైనకాలజిస్టుల పర్యవేక్షణలో గర్భిణీలకు అవసరమైన వైద్యసేవలు అందించటమే కాకుండా సాధారణ ప్రసవాలతో పాటు తప్పనిసరైతేనే సిజేరియన్‌లు చేస్తున్నట్టు తెలిపారు. నెలనెలా వంద వరకు డెలివరీలు చేయాల్సి ఉండగా నెలకు 125కు పైగా డెలివరీలు చేస్తున్నామన్నారు. సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లోని గర్భిణులు ఏరియా వైద్యశాలలో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.



నకరికల్లులో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎండీఎం ఏడీ బీ శ్రీనివాసరెడ్డి

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

● పల్నాడు జిల్లా ఎండీఎం ఏడీ బీ శ్రీనివాసరెడ్డి

నకరికల్లు, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పుష్టికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎండీఎం ఏడీ బీ శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నకరికల్లులోని మండల వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వేరుశనగ చిక్కీలు, బెల్లం, రాగిజావ తయారు చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, వంటపాత్రల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భోజన పథక నిర్వాహకులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీవో కో--ఆర్డినేటర్ ఆర్ కళ్యాణ్‌రావు, ఎంఈవో ఎంఎల్ఎన్ ప్రసాదు, శిక్షకురాలు విజయలక్ష్మి, హెచ్‌ఎంలు మేదరమెట్ల స్వామి, కంజుల రంగాదేవి, అంతయ్య, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, పీవోఎస్ అంజమ్మ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

సత్తెనపల్లి, మే 31: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. పోషక విలులతో కూడిన వంట చేసే విధానం గురించి ఎంఈవో శ్రీనివాసరావు తెలియజేశారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే రోజుకు మధ్యాహ్న పథకం నిర్వాహకులు సన్నద్ధం కావాలన్నారు. ముఖ్యంగా వంటచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంట పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. రెండో ఎంఈవో ఏ రాఘవేంద్రరరావు, పాఠశాల హెచ్‌ఎం మాధవిలత, రిసోర్స్‌పర్సన్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుక్ కమ్ హెల్పర్స్‌కు శిక్షణ

వెల్దుర్తి, మే 31: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎంఈవో కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గల కుక్ కమ్ హెల్పర్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మెనూ ప్రకారం వారిచే వంటలు చేయించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ కృష్ణకుమారి, డీఆర్‌పీ పూర్ణ చంద్రరావు, సీఆర్పీ శ్రీను, వెంకయ్య, వెంకటేశ్వర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు పాల్గొన్నారు.

● కారంపూడి, మే 31: స్థానిక ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో శుక్రవారం ఎంఈవో 2 రవికుమార్ అధ్యక్షతన మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అందించాల్సిన పోషకాహారంపై అధికారులు వివరించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు ప్రమీల, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, అనంత శివ, సాంబశివరావు, వెంకటకోటయ్య, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐదు రోజులు 144 సెక్షన్, 30 యాక్ట్

మాచర్ల రూరల్, మే 31: కౌంటింగ్ నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గ పరిధిలో ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు శనివారం నుంచి 30 యాక్ట్ అమలులో ఉంటుందని పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆరో తేదీ వరకు 144 సెక్షన్‌తోపాటు 30 యాక్ట్ అమలులో ఉంటుందని, దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా షాపులు మూసివేయాలని సూచించారు. ముగ్గురికి మించి గుంపులుగా ఉండడానికి వీల్లేదని అన్నారు. 144 సెక్షన్, 30 యాక్ట్ పకడ్బందీగా అమలు చేయనున్నామని, ప్రజలు పోలీసులకు సహకరిచాలని కోరారు. అల్లర్లు, ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● గురజాలటౌన్, మే 31: గురజాల పట్టణంలో శనివారం నుంచి ఐదు రోజులపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు రోజులపాటు దుకాణాలు మూసివేస్తుండడం వలన ప్రజలు తమకు అవసరమైన నిత్యావసర సరుకులను ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

సత్తెనపల్లి, మే 31: పట్టణంలోని ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖకు సహకరించాలని పట్టణ సీఐ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని యానాది కాలనీలో ప్రజలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదన్నారు. కాలనీలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీసుశాఖకు సమాచారమందించాలన్నారు. ఘర్షణలకు దిగి అనవసరంగా పోలీసు కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సంధ్యారాణి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

● నకరికల్లు, మే 31: ఈనెల 5వ తేదీ వరకు 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ పీ రాంబాబు తెలిపారు. 7వ విడత పోలింగ్ శనివారం సాయంత్రంతో ముగియనుండటంతో ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నందున శనివారం సాయంత్రం నుంచి 5వ తేదీ బుధవారం వరకు అంతటా 144వ సెక్షన్ విధిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు, దుకాణదారులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. ప్రజలు శనివారం రోజే ఐదు రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు తెచ్చుకొని పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. దుకాణ దారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పెదకూరపాడు, మే 31: జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ విప్పర్ల వెంకటరావు శుక్రవారం తెలిపారు. షాపులు కూడా మూసివేయాలని, ఈనెల 5వ తేదీ వరకు 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని వివరించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

● బెల్లంకొండ, మే 31: బెల్లంకొండ మండలంలో శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగుతుందని, కౌంటింగ్ అనంతరం గెలుపొందిన వారు బాణా సంచాలు, గులాంలు, ఊరేగింపులపై నిషేధం ఉన్నాయని, ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేగాకుండా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 6వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ముగ్గురు ఒకచోట ఉన్నా వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులుగా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఐలు బెనహరి, రమేష్, హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

● కారంపూడి, మే 31: మండల పరిధిలో శనివారం నుంచి ఐదు రోజులపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుదని ఎస్‌ఐ అమీర్ తెలిపారు. జిల్లా ఎస్పీ మాలిక గార్గ్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 5 నుంచి ఐదో తేదీ సాయంత్రం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటున్నందున షాపులు మూసి వేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమకు అవసరమైన సరుకులను ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకారం అందించాలన్నారు. కౌంటింగ్ రోజున హింసకు పాల్పడినా, విజయోత్సవ ర్యాలీ, బాణాసంచా కాల్పులు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● రెంటచింతల, మే 31: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసు నిబంధనలను గురించి శుక్రవారం ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎస్‌ఐ ఆంజనేయులు నేతృత్వంలో ఆటో ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పాటించాల్సిన నిబంధనలపై మైక్ ద్వారా వివరిస్తున్నారు. విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధమన్నారు. వ్యాపార దుకాణాలన్నీ ఉదయం 10 గంటలకే మూసివేయాలని, 6వ తేదీ వరకు ఈ నిబంధన అమలులో ఉంటుందన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మల్లవరం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పరారైనట్లు ఎస్‌ఐ ఆంజనేయులు చెప్పారు. 20 క్వార్టర్ల మద్యం బాటిళ్లు, 4 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రెంటచింతలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

341 బైండోవర్ కేసులు, 103 మందిపై రౌడీషీట్లు

రెంటచింతల, మే 31: మే 13వ తేదీన నిర్వహించిన పోలింగ్ రోజున అంతకు ముందు రోజు జరిగిన అల్లర్లు ఘర్షణల తీరును జిల్లా పోలీసు యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ఈ గొడవల వల్లనే ఎస్పీ బిందుమాధవ్ సస్పెండ్ కావడంతో పాటు సీఐ నారాయణస్వామిపై దాడులకు పాల్పడడాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెంటచింతల మండలం గొడవల పరంగా వార్తల్లోకెక్కింది. అందులో భాగంగా 251మంది పోలీసులను ఈ మండలానికి కేటాయించారు. 103 మందిపై రౌడీషీట్లు, 341మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మండలానికి సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఎస్పీ సేకరించారు. నిత్యం పలుమార్లు ఫోన్లో కింది స్థాయి అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు ఓ డీఎస్పీ పేర్కొన్నారు. పోలింగ్ రోజున కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డిపై రెంటాల గ్రామంలో కారంతో దాడి, వాహనాన్ని తగులపెట్టడం, ఎమ్మెల్యే పీఆర్కే పాలువాయిగేట్‌లో ఈవీఎం ధ్వంసం చేసిన తీరుపై పోలీసులు సీరియస్‌గా చర్యలు చేపడుతున్నారు.

ధూమపానం మానుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

క్రోసూరు, మే 31: ధూమపానం మానుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ అన్నారు. ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ధూమపానం నుంచి భవిష్యత్ తరాలను రక్షించాలని ఆయన కోరారు. ధూమపానం చేయటం ఫ్యాషన్ అయిపోయిందని, దీనివల్ల ఇంట్లోని పిల్లలపై ఆరోగ్యరీత్యా తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. గొంతు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధి కూడా సోకే ప్రమాదం ఉందన్నారు. పురుషుల్లో నపుంసకత్వం, మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వివరించారు. వెంటనే ధూమపానాన్ని మానుకోవటంతో పాటు ధూమపానానికి వ్యతిరేకంగా సమాజాన్ని ప్రభావితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కోరారు.

భానుడి భగభగ

సత్తెనపల్లి, మే 31: భానుడు ఉగ్రరూపం దాల్చాడు. ఈ వేసవిలో అత్యధికంగా శుక్రవారం 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ ప్రారంభం నుంచి 35 డిగ్రీలకు తగ్గకుండా ఉండగా రెండు మూడు రోజులుగా మరింత పెరిగింది. దీంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సత్తెనపల్లి పట్టణంలోని పలు రహదారుల పై జనసంచారం తగ్గింది. ప్రజలు ఇళ్ళకే పరిమితమవ్వటంతో ఫ్యాన్‌లు, ఏసీల వినియోగం పెరిగింది. రాత్రి 10 గంటలు దాటినా వేడి గాలుల తీవ్రత, ఉక్కపోత తగ్గటం లేదు. సత్తెనపల్లి మండలంలోని గ్రామాల్లో కూడా ఉక్కపోతలు ఎక్కువయ్యాయి. పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేడిగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో పిల్లలు, వృద్ధుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరియా వైద్యశాల డాక్టర్ గిరిరాజు సూచించారు. మంచినీరు, మజ్జిగ, కొబ్బరినీరు ఎక్కువగా తీసుకోవాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్ళాలన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని చల్లని ప్రాంతానికి చేర్చటంతో పాటు చల్లనినీటిలో ముంచిన వస్త్రంతో శరీరాన్ని తుడవాలన్నారు. చల్లగాలి తగిలేలా చూడాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలన్నారు.

పంపిణీకి సిద్ధంగా పుస్తకాలు: ఎంఈవో

కారంపూడి, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఈవో 2 రవికుమార్ తెలిపారు. శుక్రవారం పుస్తకాలు స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. వీటిని పరిశీలించిన ఎంఈవో మాట్లాడుతూ ఫేజ్-1లో భాగంగా విద్యాకానుక కింద ఈ పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో 2 రవికుమార్

మహిళను కత్తితో బెదిరించి నానుతాడు అపహరణ

నకరికల్లు, మే 31 : పొలంలో గడ్డి కోసుకుంటున్న మహిళను ఓ యువకుడు కత్తి చూపి బెదిరించి నానుతాడును లాక్కొని పారిపోయిన ఘటన నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామ పొలాల పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసింగపాడు గ్రామానికి చెందిన బాదం వెంకటరమణమ్మ శుక్రవారం ఆమె పొలంలో గడ్డి కోసుకోనేందుకు వెళ్ళింది. ఆమె గడ్డి కోసుకుంటున్న సమయంలో సుమారు 23 సంవత్సరాల వయస్సు గల యువకుడు ఆమె దగ్గరకు వచ్చి మాటమాట కలిపాడు. ఆ తరువాత తన వద్ద ఉన్న కత్తిని చూపి బెదిరించాడు. ఆమె మెడలో ఉన్న బంగారు నానుతాడును లాక్కొని పరిగెత్తాడు. రోడ్డుపై మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై ఉన్నాడు. నానుతాడు లాక్కున్న యువకుడు ఆ ద్విచక్రవాహనంపై ఎక్కి ఇద్దరు కలసి కారంపూడి రహదారి వైపు పారిపోయినట్టు బాధితురాలు వెంకటరమణమ్మ నకరికల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ పీ రాంబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ నానుతాడు మూడున్నర సవర్ల వరకు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

నేడు పెదకూరపాడులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు, మే 31: జూన్ 1వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ దాసరి రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

తప్పుడు సర్వేలను ఎవరూ నమ్మొద్దు

● కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ మే 31: వైసీపీ ఓటమి కళ్ల ముందు కనిపిస్తున్నా తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సొంత పార్టీవాళ్లనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముంచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎన్డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం, కూటమి ప్రభంజనం ఖాయమని తెలిసినా అధికారులను భయపెట్టడానికి, పార్టీకి అనుకూలంగా బెట్టింగ్‌లను ప్రోత్సహించడానికే పెయిడ్ సర్వేలతో అందరినీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని జీవీ చురకలు వేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి సామాన్లు సర్దుకుంటూనే, మరోవైపు మళ్లీ గెలుస్తున్నామని మేకపోతు గాంభీర్యాన్ని నమ్మి ఎవరూ మోసపోవద్దని హితవు పలికారు. గిట్టని అధికారులపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పల్నాడు జిల్లా పూర్వం ఎస్పీ బిందుమాదవ్, గుంటూరు రేంజి ఐజీ, ప్రస్తుత ఎస్పీ, మరికొందరు పోలీసు అధికారులపై ఇదే గ్లోబెల్స్ ప్రచారానికి తెరతీశారని, అలాంటి వాటితో ఎన్నికల సంఘం అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి జగన్, సజ్జల, పిల్ల సజ్జల, పప్పులు ఉడకకపోవడంతోనే ఇలాంటి నీచ రాజకీయాలకు దిగుతున్నారని ఆంజనేయులు దుయ్యబట్టారు.

సజ్జల సలహా పాటిస్తే ఏజెంట్లు జైలుకు వెళ్ళాలి

● టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల

నరసరావుపేట టౌన్, మే 31: సజ్జల సలహాపాటిస్తే వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లు జైలుకు వెళ్ళాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఒకపక్క టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌటింగ్ జరిగేటట్లు చూడమని తెలుగుదేశం కౌంటింగ్ ఏజెంట్లకు చూచిస్తుంటే, వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లకు సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్నికల నిబంధనలతో మనకు పనిలేదు, పోట్లాడే వాళ్ళే కౌంటింగ్‌కి వెళ్లండి అని చెప్పడం శోచనీయం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మీరు పదేపదే చేసిన అన్యాయానికి 90 శాతం మంది జగన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తే, అవి చెల్లకుండా చేయాలనే పనిలో సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నాడన్నారు. తెలుగుదేవం ఏజెంట్లు నిబంధనల ప్రకారం పనిచేసి మీ ఆటలు సాగనివ్వరని సజ్జల రామకృష్ణారెడ్డి గుర్తుపెట్టుకుంటే మంచిదన్నారు.

నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

● పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు



నరసరావుపేట టౌన్, మే 31 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మొత్తం పది కేంద్రాలలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పదో తరగతికి 941మంది, ఇంటర్‌లో 1279 మంది అభ్యర్థులు మొత్తం 2220మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ సప్లమెంటరీ పరీక్షలు పదో తరగతికి నాలుగు, ఇంటర్‌కు ఆరు కేంద్రాలలో జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరూ తమ అధ్యయన కేంద్రాలలో హాల్ టికెట్లను తీసుకొని మధ్యాహ్నం 2గంటల ఉంచి 2.15 గంటల లోపు పరీక్ష కేంద్రంలోకి రావాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలను డీఎంహెచ్‌వో సహకారంతో పరీక్షా కేంద్రంలో అందుబాటులో ఉండేటట్లు చేశామన్నారు. పరీక్ష జరిగే ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.



బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్ వియజలక్ష్మి, మాధవి

ఎండీఎం నిర్వాహుకులకు ఒక్కరోజు శిక్షణ

వినుకొండ, మే 31: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధాహ్న భోజన పథకం నిర్వాహకులకు, హెల్పర్లకు మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వంట పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌పీ భారతమ్మ, చీకటీగలపాలెం (ఏపీఎంఎస్) ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీజీటీ ఎం మాధవి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు చేపూరి రంగారావు, సీహెచ్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

నరసరావుపేట లీగల్, మే 31: పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి మాట్లాడుతూ పొగాకు వాటి ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు వస్తాయన్నారు. ధూమపానం చేసే వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి, డాక్టర్ హనుమ కుమార్, డాక్టర్ రాజరాజేశ్వరి, రత్నాకర్, సురేష్, ఆఫీసు సిబ్బంది, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో సమన్వయంతో పనిచేయాలి

● కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్



సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ, ఎస్పీ మాలికాగార్గ్

నరసరావుపేట, మే 31: పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపును సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని, కౌంటింగ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన యస్.హెచ్.ఓలు, రిటర్నింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులతో కౌంటింగ్‌పై సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్‌లో ఏదైనా సంఘటన జరిగితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని లత్కర్ సూచించారు. అలసత్వంవీడి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ రోజున జరిగిన పలు సంఘటనల వలన జిల్లా ఇతర జిల్లాల కన్నా ప్రాచుర్యం పొందిందన్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా తటస్థంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ పోలీస్‌శాఖ అభ్యర్థులతో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి తప్పుచేసిన వారిపై కఠినచర్యలు ఉంటాయని, ఎన్నికల ప్రక్రియలో కేసులు నమోదయితే అవి త్వరితగతిన పరిష్కారం కావన్నారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాల అనంతరం అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బైండోవర్ కేసులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై రాళ్ళు, కర్రలు లేకుండా చూడాలని సూచించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, కూడళ్ళపై అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు మొబైల్ ఫోనులు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ ఉండేలా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక సామగ్రి అందుబాటులో ఉంచాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అవసరమైన ప్రథమ చికిత్సా కేంద్రం ఏర్పాటుతో పాటు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ సెంటర్లో హైస్పీడ్ అంతర్జాల సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కౌంటింగ్ సిబ్బందికి బస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ.టి.పి.బి.యస్ కౌంటింగ్‌కు సంబంధించి స్కానర్లు ఉంచాలన్నారు. 108 అంబులెన్స్ సర్వీస్ అందుబాటులో ఉంచాలన్నారు. మొబైల్ డిపాజి సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందచేయాలన్నారు.

ఎస్పీ మాలికాగార్గ్ మాట్లాడుతూ బైండోవర్ కేసులపై తక్షణ చర్యలు తీసుకొని నగదు చెల్లించని వారిని అరెస్టు చేయాలన్నారు. 3వ తేదీ రాత్రి, 4న అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. పరారీలో ఉన్న వారిని జిల్లాలోకి అనుమతించవద్దని తెలిపారు. లూజ్‌పెట్రోల్, బాణసంచాలకు అనుమతి లేదని, పోలీసు, రెవెన్యూ శాఖ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్స్‌లు రద్దుచేయాలని సూచించారు. జేసీ ఎ.శ్యాంకుమార్ మాట్లాడుతూ సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు

యడ్లపాడు, మే 31: యడ్లపాడులోని శ్రీరణవీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. హనుమజ్జయంతిని పురస్కరించుకుని రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. తొలిరోజు గణపతిపూజ, పంచామృతాలతో అభిషేకంతోపాటు లక్ష నాగవల్లీ దళాలతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి నేతృత్వంలో సామూహిక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.





యడ్లపాడు శ్రీరణవీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి అభిషేకం, అనంతరం నాగవల్లీ దళాలతో అర్చన చేస్తున్న అర్చకులు

నేడు హనుమత్ జయంతి

నాదెండ్ల, మే 31: మండలంలోని ఎండుగుంపాలెం గ్రామ సమీపంలోని అక్కాయకుంట వద్ద గల సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమంత్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆకు పూజలు, అభిషేకాలు జరిపి అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ వేడుకలు జరుగుతాయి.



హనుమాన్ జయంతి సందర్భంగా గుంటి ఆంజనేయస్వామికి పూజలు చేపడుతున్న మాలాధారణ స్వాములు

వినుకొండలో ఉత్సవాలు ప్రారంభం

వినుకొండ, మే 31: పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తులు శుక్రవారం ప్రారంభించారు. శనివారం తెల్లవారు జాము నుంచి స్వామి వారికి అష్టోత్తర శత కలశ అభిషేక్ స్నాపన తిరుమంజనం. హనుమద్ధయాత్ర మూలమంత్ర హోమం, సాయంత్రం సువర్చల సమేత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని షిరిడీ శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జయంతి కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి లక్ష తమలపాకులతో అర్చన కార్యక్రమాలతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి



నరసరావుపేటలో అన్నదానం చేస్తున్న ఎండీ ఫారూఖ్‌బాబు, తదితరులు



కృష్ణ జయంతి సందర్భంగా పేదలకు పులిహోర పంపిణీ చేస్తున్న కృష్ణ అభిమానులు

వినుకొండ టౌన్, మే 31: సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కృష్ణా ఫ్యాన్సు శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. ఆర్టీసీ, ఏనుగుపాలెం సెంటర్లలో పేదలకు పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణా ఫ్యాన్సు నాయకులు మాట్లాడుతూ త్వరలో కృష్ణ కాంశ్య విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తులం శ్రీను, పివి సురేష్, చికెన్ బాబు, షేక్ సుభాని, ఎస్‌కె.బాండురవి కుమార్, చిట్టిబాబు, లక్ష్మీనారాయణ. రత్నాకర్, వీరాంజి, నాగలింగాచారి, తిరుమల చారి, వెంకట్రావు, పూర్ణ , స్టీఫిన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నరసరావుపేట టౌన్, మే 31: పట్టణంలోని పెద్దచెరువు తొమ్మిదో లైన్‌లో సెయింట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా, టౌన్‌వైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షుడు ఎండీ ఫారూఖ్‌బాబు ఆధ్వర్యంలో ముందుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. పట్టణ అధ్యక్షుడు ఎండీ ఫారూఖ్‌బాబు మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీ వెంకటరావు, పద్మాలయ వేణు, బీ కొండలరావు, అంజనేయులు, షేక్ నాగూర్, లింగంగుంట్ల రాములు, ధామస్, సీహెచ్ వెంకట్, షేక్ సలామ్, డీ నాగేశ్వరరావు, చిన్నికృష్ణ, జీ కోటేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు వంకాయలపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీ ఉదయం వరకు అన్ని దుకాణాల మూసివేత

● రెండో పట్టణ సీఐ భాస్కర్

నరసరావుపేట లీగల్, మే 31: ఈ నెల 4న కౌంటింగ్ సందర్భంగా నేటి సాయంత్రం 5 గంటల నుంచి 5వ తేదీ ఉదయం వరకు పట్టణంలోని అన్ని షాపులు మూసివేయాలని రెండో పట్టణ సీఐ ఏ భాస్కర్ కోరారు. కావాల్సిన వస్తువులు, సరుకులు ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. పట్టణంలో 144వ సెక్షన్ అమల్లో ఉందన్నారు. ప్రజలు ఎవ్వరూ గుంపులుగా బయట తిరగకూడదన్నారు. జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా బాణ సంచా కాల్చటానికి కాని, ర్యాలీలకు గాని, కేక్ కటింగ్, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఎవ్వరూ రోడ్లపైకి రాకూడదన్నారు. అల్లర్లకు పాల్పడే వారితో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. యజమానులు దుకాణాలు మూసివేసి పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

● రొంపిచర్ల, మే 31: మండలంలోని గ్రామాల్లో నేటి సాయంత్రం 5 గంటల నుంచి 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ పాల్ రాజ్ రవీంద్ర శుక్రవారం తెలిపారు. ఈ మేరకు గ్రామాల్లో జీపు ద్వారా ప్రచారం నిర్వహించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి: ఎంపీడీవో

చిలకలూరిపేట, మే 31: చిలకలూరిపేట మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రభుత్వ సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 8,781మంది పెన్షనర్లు ఉన్నారని, వారికి రూ.2,60,68,000 పింఛన్లు అందజేయటం జరుగుతుందన్నారు. వీటిలో 6,625 మందికి రూ.1.99కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాలకే జమ చేస్తారని తెలిపారు. 2,156మంది పెన్షనర్లకు రూ.61.93 లక్షలు ఇంటింటికి తిరిగి పంపిణీ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు.

ఏఎస్ఐకు ఘన సన్మానం

నరసరావుపేట లీగల్; మే 31: పల్నాడు జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని శుక్రవారం జిల్లా ఎస్పీ మల్లికగార్గ్ ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడుకోలు పలికారు. జిల్లా పరిధిలో శుక్రవారం పదవి విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ మోహన్‌రెడ్డి, నకరికల్లు ఏఎస్ఐ వీ ప్రసాదరావు, చిలకలూరిపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో సేవలు అందిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మణరావు కుటుంబ సభ్యులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిపి శాలువా కప్పి ఘనంగా సన్మానించి పూలమాలలతో సత్కరించారు.



విరాళాన్ని అందజేస్తున్న దాత వెంకట్రాయుడు

పలనాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి దాతల విరాళం

శావల్యాపురం, మే 31: జన విజ్ఞాన వేదిక, ఇతర ప్రజాసంఘాలు కలసి సంయుక్తంగా నర్సరావు పేటలో నిర్మిస్తున్న పలనాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన బోయపాటి వెంకట్రాయుడు రూ.లక్ష విరాళాన్ని ప్రజాసంఘాల నాయకులకు శుక్రవారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందింపజేసి భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్న లక్ష్యంతోనే పలనాడు విజ్ఞాన కేంద్రానికి శాశ్వత భవనాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. పలనాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు, వివిధ రకాల కళలు, శాస్త్రీయ ఆలోచనా విధానాలను పెంచడమే కాక పేదలకు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్న లక్ష్యంతోనే పలనాడు విజ్ఞాన కేంద్రం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్, సీఐటీయూ మండల కార్యదర్శి భువనగిరి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన సంఘం నాయకులు వెంకటేశ్వరరాజు, సూరాబత్తుని గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

బొల్లాపల్లి, మే 31: మండలంలోని మేళ్ళవాగు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వై రామకోటేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందరంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

సహాయ ఆడిట్ అధికారి మస్తాన్ షరీఫ్‌కు ...

నరసరావుపేట కల్చరల్, మే 31. జిల్లా ఆడిట్ శాఖలో సహాయ ఆడిట్ అధికారిగా సుదీర్ఘ కాలం సేవలందించిన షేక్ మస్తాన్ షరీఫ్ ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరించారు. జోన్ -3 ఒంగోలు, ప్రాంతీయ సంచాలకులు కె.నాగ శ్రీనివాస్, జోన్- 2 ప్రాంతీయ సంచాలకులు బి.చిన్నపరెడ్డి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజు ఎస్పీ కార్యాలయానికి హాజరైన పిన్నెల్లి

నరసరావుపేట లీగల్, మే 31: హైకోర్టు బెయిల్ సమయంలో విధించిన షరతులకు లోబడి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాల్గోరోజు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో వచ్చి సంతకాలు చేసి వెళ్లారు.

పైపులైన్ మరమ్మతులను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్



తాగునీటి పైపులైను మరమ్మతులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, మే 31: పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైన్ మరమ్మతులు శరవేగంగా నిర్వహించి ఆదివారం ఉదయం తాగునీటిని సరఫరా చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సి. రవిచంద్రారెడ్డి తెలిపారు. నకరికల్లు మండలం శాంతినగర్ నుంచి నరసరావుపేట పట్టణం వరకు తాగునీటి సరఫరా పైపలైన్ మరమ్మతు పనులను మునిసిపల్ కమిషనర్ సి రవిచంద్రారెడ్డి, మునిసిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంటు ఇంజనీరు రాములు నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పోస్టల్ బ్యాలెట్‌పై వివాదం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 31: ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌పై వివాదాలు రేపేందుకు తంటాలు పడుతున్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. శుక్రవారం తన నివాసంలో జరిగిన సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను ఇబ్బందిపెట్టి ఇప్పుడు వారి ఓట్ల విషయంలోను చిక్కులు పెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 4,44,216 వరకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు పోలింగ్ కావటమే కారణమన్నారు. మొత్తం పోస్టల్ ఓట్లలో కనీసం 90 శాతం తెలుగుదేశం కూటమికి పడ్డాయన్న అంచనాలతో సీఎం జగన్‌రెడ్డి వెన్నులో ఒణుకు మొదలైందన్నారు. వైసీపీ నాయకులు తల్లకిందులుగా తపస్సు చేసినా వారి దింపుడు కళ్ళం ఆశలు ఫలించవని, వైసీపీ ఓటమి పోస్టల్ బ్యాలెట్లతోనే ప్రారంభం కానున్నదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

5వ తేదీ వరకు 144వ సెక్షన్ అమలు

చిలకలూరిపేట, మే 31: చిలకలూరిపేట నియోజక వర్గ పరిధిలో 144వ సెక్షన్ అమల్లో ఉన్నదని, ప్రజలు గుంపులుగా గుంపులుగా బయట తిరగ కూడదని చిలకలూరిపేట అర్బన్, రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. వీలైనంత వరకు గృహాల నుంచి బయటకు రావద్దని కోరారు. కౌంటింగ్ రోజు జూన్ 4న ఎవ్వరూ రోడ్ల మీదరకు రాకూడదని, అల్లర్లకు, గొడవలకు దిగ కూడదని వారు హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో బాణ సంచా కాల్చటానికి వీల్లేదని తెలిపారు. జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి జూన్ 5వ తేదీ ఉదయం వరకు అన్ని దుకాణాలను మూసి వేయాలని కోరారు. ప్రజలు అవసరమైన సరుకులను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, మే 31: మండలంలోని సాతులూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 6:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. సబ్ స్టేసన్‌లో మరమ్మతుల దృష్ట్యా సాతులూరు, చందవరం, పొనుగుపాడు, దొండపాడు, డైరీ ఇండస్ట్రీ, జ్యోతిర్మయి ఇండస్ట్రీ, సాతులూరు పరిశ్రమలకు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయటం జరుగుతుందని, వినియోగ దారులు సహకరించాలని కోరారు.

గృహంలో చోరీ

నాదెండ్ల, మే 31: మండలంలోని తూబాడులోని వాటర్ ట్యాంక్ సమీపంలోని ఒక ఇంటిలో చోరీ జరిగింది. ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలోని కొన్ని వస్తువులను చోరీ చేసినట్టు అనుమానిస్తున్నారు. ఇంటి యజమాని కావూరి కోటేశ్వరరావు దంపతులు కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో తమ బంధువుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. చోరీ విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న కోటేశ్వరరావుకు స్థానికులు తెలియజేశారు. ఆయన ఇంటికి వస్తే ఏ వస్తువులు చోరీకి గురైన విషయం తెలుస్తుంది. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు నాదెండ్ల పోలీసులు ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలకలూరిపేట, మే 31: చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఒక వ్యక్తి ఫ్లాట్ ఫారం నెంబరు 10వద్ద అపస్మారక స్థితిలో ఉండగా కనుగొన్నారు. వెంటనే అతడిని 108 వాహనం ద్వారా చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ప్రకటించారు. అతడికి సుమారు 50-60 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని భావిస్తున్నారు. అతని వివరాలు తెలియనప్పటికీ అతని షర్టు కాలర్ మీద అజయ్ టైలర్స్, మంగళగిరి అని ఉన్నది. అతని జేబులో ఉన్న ప్యాకెట్ పుస్తకంలో వీ సాయి మౌనిష్ అని ఉన్నది. ఇతడికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే తెలియ జేయాలని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు తెలిపారు.

గంగన్నపాలెం, మద్దిరాలలో రూరల్ పోలీసుల ముఖాముఖి

చిలకలూరిపేట, మే 31: చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం, మద్దిరాల గ్రామాల్లో చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామ ప్రజలు గొడవలకు దిగకుండా ప్రశాంతంగా ఉండాలని ఆయన కోరారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే నిబంధనల ప్రకారం కేసులు పెట్టి అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్ఐ రవి కృష్ణ తదితరులు ఉన్నారు.

తాతపూడి వద్ద రెండు లారీల ఢీ

చిలకలూరిపేట, మే 31: జాతీయ రహదారిపై చిలకలూరిపేట-మార్టూరు మధ్య తాతపూడి గ్రామం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై ఆగి ఉన్న లారీని విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న మరొక లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బోగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మోకాళ్ళపై ప్రార్థన

బొల్లాపల్లి, మే 31: నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు, వినుకొండ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఘన విజయం సాధించాలని బొల్లాపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మండలంలోని రెడ్డిపాలెం ఆర్‌సీఎం చర్చిలో మోకాళ్ళ మీద ప్రార్థన చేశారు. ఈ ప్రార్థనల్లో రాష్ట్ర ఎస్సీ టీడీపీ ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, ఆదం, వెంకటరావు, మీసాల యోహాన్, సికా రామయ్య, సికా కోటేశ్వరరావు, ధూపాటి ఎర్రగోటయ్య, ధూపాటి బాబు, మీసాల గాబ్రేలు, గుంజర నాసరబాబు, చంద్ర శేఖర్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

3న శావల్యాపురం మండల సర్వసభ్య సమావేశం

శావల్యాపురం, మే 31: శావల్యాపురం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన జరగనుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 3వతేదీ సాయంత్రం 3గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి శుక్రవారం తెలిపారు.

సృజనకు నాట్స్ సేవా పురస్కారం



చెరుకూరి సృజన

యడ్లపాడు, మే 31: స్థానిక నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజనకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి గురువారం రాత్రి నాట్స్ ఆధ్వర్యంలో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జానపద కళ, విద్యా సాంస్కృతిక సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా నాట్స్ అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుల చేతుల మీదుగా సృజన ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.